క్లుప్తంగా

కలెక్టర్‌ను కలిసిన న్యాయశాఖ ఉద్యోగులు

కొత్తగూడెంటౌన్: కలెక్టర్ ప్రియాంక అలాను ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ సమక్షంలో మంగళవారం జిల్లా న్యాయశాఖ ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిశారు. గౌరవ అధ్యక్షుడు మల్లికార్జున్, ఉపాధ్యక్షురాలు ప్రమీల, ట్రెజరర్ లగడపాటి సురేష్, దీకొండ రవి, జిల్లా కోర్టు ఆఫీసర్ అనితావాణి కలెక్టర్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

జేసీని కలిసిన జీఎం

ఇల్లెందు: జిల్లా జాయింట్ కలెక్టర్ పి.రాంబాబును ఇల్లెందు ఏరియా సింగరేణి జీఎం జాన్ ఆనంద్ మంగళవారం కొత్తగూడెంలోని ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువతో సత్కరించి పూలమొక్కను అందజేశారు. ఇల్లెందు ఏరియాలోని బొగ్గు ఉత్పత్తి వివరాలు నూతన జేకే ఓసీ విస్తరణ పనుల గురించి వివరించారు. జీఎం వెంట ఎస్టేట్ అధికారి మహేష్, శివకుమార్ ఉన్నారు.

లాభాల్లో వాటా, ఏరియర్స్ చెల్లించాలి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ 2022–23లో సాధించిన లాభాల్లో కార్మికులకు వాటాతో పాటు 11వ వేతన సవరణకు సంబంధించి ఏరియర్స్ వెంటనే చెల్లించాలని గోదావరి లోయ బొగ్గుగని కార్మిక సంఘం(టీజీఎల్‌బీకేఎస్) నాయకులు కోరారు. మంగళవారం వారు కొత్తగూడెం ఏరియా ఎస్ఓటూ జీఎం కోటిరెడ్డికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. సీఎం కేసీఆర్ ప్రకటించినట్లుగా లాభాల వాటాను వెంటనే చెల్లించాలని, వేతన సవరణ ఒప్పందంలో భాగంగా ఏరియర్స్ కూడా జమ చేయాలన్నారు.

బాధ్యతలు చేపట్టిన నవీన్‌కుమార్



నవీన్‌కుమార్‌ను అభినందిస్తున్న ఉద్యోగులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కార్పొరేట్‌లో సీహెచ్‌పీల జనరల్ మేనేజర్‌గా సీహెచ్ నవీన్‌కుమార్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఈ పోస్టులో విధులు నిర్వహించిన స్వామినాయుడు ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు నవీన్‌కుమార్‌ను అభినందించారు. కార్యక్రమంలో జీఎం సుబ్బారావు, ఏజీఎం భాస్కర్ రెడ్డి, బీఎస్‌రావు, సురేష్, సుమలత, సునీల్ వర్మ, అధికారులు పాల్గొన్నారు.

ఫిల్టర్ బెడ్ పరిశీలన

పాల్వంచ: పట్టణంలోని కరకవాగు ఫిల్టర్ బెడ్‌ను మున్సిపల్ కమిషనర్ ఎ.స్వామి మంగళవారం సందర్శించి పరిశీలించారు. మంచినీటిని శుద్ధి చేసే తీరును డీఈ మురళీ, ఏఈ రాజేష్‌లను అడిగి తెలుసుకున్నారు. తాగునీటి శుద్ధిలో లోటుపాట్లు లేకుండా చూడాలన్నారు. క్రమం తప్పకుండా పట్టణంలో అన్ని ఏరియాలకు తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

కేఓసీ సందర్శన

టేకులపల్లి: మండలంలోని కోయగూడెం ఓపెన్ కాస్ట్ గనిని టీబీజీకేఎస్ నాయకులు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వరుస వర్షాలతో ఏర్పడిన పరిస్థితులపై ప్రాజెక్ట్ ఆఫీసర్ ప్రహ్లాద్‌తో చర్చించారు. ఆ తర్వాత క్యాంప్‌లకు కూడా వెళ్లి కార్మికులకు అందిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు.

అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేయండి

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఆన్‌లైన్ చేసుకున్న అర్హులైన జర్నలిస్టులందరికీ రెండో విడత సమావేశం ఏర్పాటు చేసి అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేయాలని టీయూడబ్ల్యూజే (టీజేఎఫ్) ఆధ్వర్యంలో కలెక్టర్ డాక్టర్ ప్రియాంకకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కళ్లోజి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి షఫీ మహమ్మద్, వట్టికొండ రవి, చంద్ర నరసింహారావు, కాటా సత్యం పాల్గొన్నారు.

గేట్లు ఎత్తితే జలమయం

- వరద ముంపునకు గురవుతున్న కిన్నెరసాని, రాజాపురం గ్రామాలు
- శాశ్వత పరిష్కారం చూపాలంటున్న బాధితులు



ప్రాజెక్టు గేట్లు ఎత్తినప్పుడు కిన్నెరసాని గ్రామాన్ని ముంచెత్తిన వరద

పాల్వంచరూరల్: కిన్నెరసాని ప్రాజెక్టు గేట్లు ఎత్తినప్పుడల్లా ఊరు సగం జలమయంమవుతుంది. ప్రతి సంవత్సరం వర్షాకాలంలో వరద ముంపునకు గురవుతోంది కిన్నెరసాని గ్రామం. దీంతో ప్రజలు క్షణక్షణం భయంభయంగా జీవనం సాగిస్తున్న పరిస్థితి. మండల పరిధి కిన్నెరసాని గ్రామపంచాయతీలో మొత్తం 200 వందలకు పైగా కుటుంబాలు ఉండగా 1200 మంది జనాభా. ఇందులో కిన్నెరసాని గ్రామంలో 96 కుటుంబాలు నివాసం ఉండగా 400పైన జనభా ఉంది. గ్రామం కిన్నెరసాని ప్రాజెక్టుకు దిగువ భాగంలో ఉండటం వలన వర్షాకాలంలో ప్రాజెక్టు గేట్లు ఎత్తినప్పుడల్లా కిన్నెరసాని వాగుకు సమీపంలో ఉన్న నివాసాలు జలమయంగా మారుతున్నాయి. ప్రాజెక్టు గేట్లు ఎత్తినప్పుడల్లా గ్రామంలోని ఇళ్లల్లోకి వరదనీరు వచ్చి చేరుతుంది. దీంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఎన్నడూలేని విధంగా ఇటీవల కిన్నెరసాని జలాశయంలోకి వరద పోటెత్తడంతో ప్రాజెక్టుకు చెందిన 12గేట్లను ఎత్తి 1.10లక్షల క్యూసెక్కుల వరద నీటిని వాగులోకి వదలడంతో గ్రామం ముంపునకు గురయింది. కిన్నెరసాని వాగు పరివాహక ప్రాంతంలో ఉన్న కిన్నెరసాని, రాజాపురం గ్రామాలు ప్రతి సంవత్సరం వరద ముంపున బారిన పడుతున్నాయి. రెక్కాడితే గానీ డొక్కాడని నిరుపేద కుటుంబాలు వర్షాకాలంలో వరదలు వచ్చినప్పుడు ఇళ్లు ఖాళీ చేసి ఇతర ప్రాంతాలకు వెళ్లి వరద తగ్గిన తర్వాత ఇళ్లకు చేరుకుంటున్నారు.

శాశ్వత పరిష్కారం కోసం ఎదురుచూపు..

అధికారులకు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది కాకపోతే వచ్చే ఏడాదైనా సమస్యకు పరిష్కారం దొరక్కపోతుందా అని ఎదురుచూస్తున్నారు. గ్రామంలో 40 ఎకరాల ప్రభుత్వ స్థలం ఉంది. అక్కడ వరద ముంపు బాధితులకు ఇళ్లు కట్టించి శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.



మునిగిన రాజాపురం వైకుంఠధామం

అవస్థలు పడుతున్నాం



ప్రతి సంవత్సరం కిన్నెరసాని ప్రాజెక్టు గేట్లు ఎత్తినప్పుడల్లా ఇళ్లల్లోకి వరదనీరు చేరుతోంది. అధికారులు ప్రాజెక్టు సైరన్ మోగించకుండానే ఒక్కసారిగా గేట్లను ఎత్తివేస్తున్నారు. దీంతో ఇళ్లల్లోని వస్తువులన్నీ మునిగి అవస్థలు పడుతున్నాం. మైదాన ప్రాంతాల్లో స్థలాలు కేటాయించి ఇళ్లు మంజూరు చేయాలి. – మహ్మద్ వసీం, కిన్నెరసాని

మైదాన ప్రాంతానికి తరలించాలి



వర్షాకాలం వచ్చిందంటే వణుకు పుడుతోంది. ఎప్పుడు ప్రాజెక్టు గేట్లు ఎత్తుతారో తెలియదు. వరద ఇళ్లల్లోకి చేరడంతో కుటుంబం మొత్తం రేయింబగవళ్లు ఇల్లు వదిలి రోడ్డు మీద నిరీక్షించాల్సిన పరిస్థితి. ముంపునకు గురయ్యే ఇళ్లను గుర్తించి సురక్షితమైన ప్రాంతంలో ఇంటిస్థలంతోపాటు ఇళ్లు మంజూరు చేయాలి. – తోట్ల ప్రమీల, కిన్నెరసాని

ప్రతిపాదనలు పంపించాం



వరద ముంపునకు గురవుతున్న నివాసాలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్ల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించడం జరిగింది. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే చర్యలు తీసుకుంటాం. ఇటీవల కిన్నెరసాని ప్రాజెక్టు 12గేట్లు ఎత్తినప్పుడు వరదను స్పెషల్ ఆఫీసర్‌తో కలిసి పరిశీలించాం. – బి.అప్పారావు, ఎంపీడీఓ

కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



ఆటో యూనియన్ సభ్యులతో ఎమ్మెల్యే హరిప్రియ

ఇల్లెందు: కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా బీఆర్ఎస్ ప్రభుత్వం పలు పథకాలు అమలు చేస్తోందని ఎమ్మెల్యే హరిప్రియ అన్నారు. ప్రపంచ ఆటో కార్మికుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం కొత్తబస్టాండ్ సెంటర్‌లో ఆటో యూనియన్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొని కేక్ కట్ చేసి మాట్లాడారు. అనంతరం అంగన్‌వాడీ వర్కర్లకు ఇతర విధులు రద్దు చేయాలని ఏఐటీయూసీ అనుబంధ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. దేవరకొండ శంకర్, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, సీఐ టి.కరుణాకర్,, కొక్కు నాగేశ్వరరావు, కామిశెట్టి సైదులు తదితరులు పాల్గొన్నారు.

జూలూరుపాడు: మండల కేంద్రం జూలూరుపాడులోని పాపకొల్లు ఆటో అడ్డా వద్ద మంగళవారం ఆటో వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో ప్రపంచ ఆటో డ్రైవర్ల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. పత్తిపాటి మహేష్, గార్లపాటి వీరభద్ర, కనకపుడి నరసింహారావు, గార్లపాటి శివకృష్ణ, రామారావు, సుందర్‌రావు, కిరణ్, లక్ష్మయ్య పాల్గొన్నారు.

ఇల్లెందులో వంద శాతం బొగ్గు ఉత్పత్తి

ఇల్లెందు: బొగ్గు ఉత్పత్తిలో ఇల్లెందు ఏరియా అగ్రస్థానంలో నిలిచిందని ఏరియా జీఎం జాన్‌ఆనంద్ వెల్లడించారు. ఇల్లెందులో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన జూలైలో సాధించిన ఉత్పత్తి, ఉత్పాదకత వివరాలు తెలిపారు. జూలై నెలకు 2.13 లక్షల టన్నుల లక్ష్యాన్ని నిర్దేశించగా 2.14 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సమోదైనట్లు చెప్పారు. ఇందులో 1.01 లక్షల టన్నులు రైలు మార్గం ద్వారా, 0.21 లక్షల టన్నులు రోడ్డు మార్గం ద్వారా, ఆర్‌సీహెచ్‌పీ ద్వారా 0.92 లక్షల టన్నుల బొగ్గు రవాణా చేసినట్లు పేర్కొన్నారు. కాగా, జేకే ఓసీకి అనుమతులు లభిస్తే వచ్చే డిసెంబర్ ఉత్పత్తి మొదలయ్యే అవకాశముందని జీఎం తెలిపారు. ఇప్పటికే కలెక్టర్ ప్రియాంక అల, డీఎఫ్ఓ కృష్ణ గౌడ్‌ను కలిసి చర్చించినట్లు చెప్పారు. రైలు ప్రమాదంలో మృతి చెందిన సెక్యూరిటీ గార్డు నగేష్ ఎస్‌బీఐలో కార్పొరేట్ అకౌంట్‌గా మార్చుకుని ఉండడంతో రూ.72 లక్షల ప్రమాద పరిహారం అందిందన్నారు. సమావేశంలో అధికారులు శ్రీనివాస్, జీ.వీ.మోహన్‌రావు, సాయిస్వరూప్ పాల్గొన్నారు.

ఉద్యోగులను క్రమబద్ధీకరించండి



నిరసన తెలుపుతున్న కాంట్రాక్టు ఉద్యోగులు

జూలూరుపాడు: పాఠశాల విద్యాశాఖలో భాగమైన సమగ్ర శిక్ష ప్రాజెక్టులో పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని సమగ్ర శిక్ష ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక మండల వనరుల కేంద్రం(ఎంఆర్‌సీ) ఎదురుగా నిరసన తెలిపారు. మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు అనుగుణంగా సమాన పనికి, సమాన వేతనం ఇవ్వాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 2011–2012లో సమగ్ర శిక్ష ప్రాజెక్టు కింద స్కూల్ కాంప్లెక్స్ స్థాయిలో క్లస్టర్ రిసోర్స్ పర్సన్ (సీఆర్‌పీ), కేజీబీవీ, యూఆర్‌ఎస్, ఐఈఆర్‌పీ, మిస్, సీసీఓలను రూల్ ఆఫ్ రిజర్వేషన్, మెరిట్ ప్రాతిపాదికన ఎంఎస్‌డబ్ల్యూ, డిగ్రీ, బీఈడీ అర్హతలు ఉన్న అభ్యర్థులను కలెక్టర్ చైర్మన్‌గా ఎంపిక కమిటీ నియామకాలు చేపట్టిందన్నారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బానోత్ సేవ్యా, సీఆర్‌పీల సంఘం జిల్లా కార్యదర్శి నునావత్ రమేష్, ఉద్యోగులు రవీందర్, పరమేష్, అప్పారావు, నిరోష, శ్రావణి, శ్రవణ్ కుమార్, సాంబశివరావు, మెసెంజర్ బేబి పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు ఖాయం..

ఇల్లెందు: దేశంలో, రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు ఖాయం అని భద్రాచలం ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్య అన్నారు. మంగళవారం ఇల్లెందులో పలువురు ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు.

టేకులపల్లి: బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ మేరకు మంగళవారం టేకులపల్లిలోని పొంగులేటి క్యాంపు కార్యాలయం నుంచి నాయకులు ఒక ప్రకటన విడుదల చేశారు. తొమ్మిది మంది సర్పంచ్‌లు, ఎనిమిది మంది ఎంపీటీసీలు, నలుగురు మాజీ సర్పంచ్‌లు, ముగ్గురు మాజీ ఎంపీటీసీలు, ఇద్దరు ఉప సర్పంచ్‌లు, ఇద్దరు మాజీ సొసైటీ డైరెక్టర్లు, కార్యకర్తలు టేకులపల్లి నుంచి ఇల్లెందుకు వెళ్లి పార్టీ జిల్లా అధ్యక్షుడు పొదెం వీరయ్య సమక్షంలో పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి నాయకత్వంలో కోరం కనకయ్య ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు పేర్కొన్నారు.

అర్ధరాత్రి అనవసరంగా తిరగొద్దు



తనిఖీ చేస్తున్న సీఐ వినయ్‌కుమార్, సిబ్బంది

పాల్వంచ: అర్ధరాత్రి వేళ అనవసరంగా ఎవరూ బయట తిరగొద్దని పాల్వంచ సీఐ వినయ్‌కుమార్ సూచించారు. పట్టణంలోని నవభారత్ కేఎస్‌ఎం బంక్ నుంచి 15కి.మీ. మేర సోమవారం రాత్రి సీఐ ఆధ్వర్యాన ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ నిబంధనలను ఉల్లఘించిన 15మంది వాహనదారులకు జరిమానా విధించారు. అలాగే, పట్టణంలోని లాడ్జీల్లో తనిఖీలు చేపట్టి అనుమానితుల వివరాలు ఆరా తీశారు.

ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు..

ట్రాక్టర్ డ్రైవర్లు, యజమానులు ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని పాల్వంచ సీఐ వినయ్‌కుమార్ హెచ్చరించారు. పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో ట్రాక్టర్ యజమానులను మంగళవారం తహసీల్దార్‌కు బైండోవర్ చేశారు. మాట్లాడుతూ.. బైండోవర్ చేసిన ఒక్కొక్కరు రూ.2లక్షల పూచీకత్తు సమర్పించాలని, మరోమారు ఇసుక రవాణాకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామన్నారు.

నేటి నుంచి ఓటర్లకు అవగాహన

టేకులపల్లి: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నేటి నుంచి ఈ నెల 16 వరకు మండలంలోని 44 పోలింగ్ బూత్‌ల పరిధిలోని ఓటర్లకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కోట వీరబాబు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్ణయించిన ఆయా పంచాయతీల్లో సదస్సులు జరుగుతాయని తెలిపారు.

అన్నదానం

కొత్తగూడెంఅర్బన్: లయన్స్ క్లబ్ ఆఫ్ కొత్తగూడెం సీనియర్ సభ్యుడు పల్లపోతు శ్రీనివాస్ సతీమణి పల్లపోతు కవితాలక్ష్మి పుట్టిన రోజు సందర్భంగా మంగళవారం సత్యసాయి అనాథాశ్రమంలో అన్నదానం నిర్వహించారు.

వెలగని వీధి దీపాలు

సుజాతనగర్: సింగభూపాలెం గ్రామ పంచాయతీలోని పలు వార్డుల్లో వీధి లైట్లు కాలిపోయి నెల రోజులుగా వెలగడం లేదు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న సమయంలో వీధుల్లో పాములు, విష కీటకాల తిరుగుతున్నాయని పాలకులు స్పందించి వీధి లైట్లు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. అదేవిధంగా 3,4,5 వార్డుల పరిధిలో తాగు నీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నామని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జెడ్పీఎస్ఎస్‌లో పరిశీలన



పాఠశాలను సందర్శించిన సింగరేణి అధికారులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): రుద్రంపూర్ జెడ్పీఎస్ఎస్‌లో సింగరేణి కొత్తగూడెం ఏరియా అధికారులు మంగళవారం పరిశీలించారు. పాఠశాలలో చేపట్టాల్సిన మరమ్మతులపై ఇటీవల టీజీబీకేఎస్ నాయకులు వినతిపత్రం అందించారు. ఈ మేరకు అధికారులు కోటిరెడ్డి, రాజారాం, అచ్యుతరామయ్య పాఠశాలను పరిశీలించారు. ఎండీ రజాక్, చిలక రాజయ్య, ఎండీ సత్తార్ పాషా, నాగేశ్వరరావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

గడువు పొడిగింపు

ఇల్లెందు: అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ అడ్మిషన్ల గడువు ఈ నెల 16వరకు పొడిగించినట్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.పద్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 7382929737 నంబరులో సంప్రదించాలని కోరారు.

పాఠశాలలో వైద్యశిబిరం

టేకులపల్లి: సులానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని సులానగర్ హైస్కూల్, ప్రైమరీ పాఠశాలల్లో స్థానిక వైద్యాధికారి డాక్టర్ కందుల దినేష్ ఆధ్వర్యంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు ఇచ్చారు. బాల బాలికలు వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని కండ్ల కలక ఇప్పుడు తీవ్రంగా వ్యాపిస్తోందని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ఇళ్ల స్థలాలివ్వాలి

పాల్వంచ: జిల్లాలో ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా ఉపాధ్యాయులకు నివాస స్థలాలను నామమాత్రపు ధరకు కేటాయించాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డి.వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం స్థానిక పాత పాల్వంచ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో వై.సంగమేశ్వరరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. పీఆర్‌సీని జూలై 1నుంచి అమలు చేయడానికి కమిటీ వేసి వెంటనే ఐఆర్ ఉత్తర్వులు ఇవ్వాలన్నారు.

నిబంధనలు పాటించాలి

టేకులపల్లి: మిర్చి నారు పెంపకానికి ఏర్పాటు చేసిన నర్సరీల్లో ప్రభుత్వ నిబంధనలు పాటించాలని వ్యవసాయ శాఖ ఇల్లెందు డివిజన్ అధికారిణి వాసవీ రాణి అన్నారు. మంగళవారం ఆమె మండలంలో పర్యటించారు. బేతంపూడి స్టేజీలో ఏర్పాటు చేసిన ప్రైవేట్ నర్సరీని ఆమె ఏఓతో కలిసి తనిఖీ చేశారు. నిబంధనల ప్రకారం ఏర్పాటు చేశారా లేదా.. లైసెన్స్ ఉందా లేదా అని పరిశీలించారు. నర్సరీ, నిర్వహణ, నారు సంరక్షణకు సంబంధించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అనుమతి లేకుండా నర్సరీలు నిర్వహించొద్దని పేర్కొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల హర్షం

చుంచుపల్లి: ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం పట్ల కొత్తగూడెం డిపో మేనేజర్ బాణాల వెంకటేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక బస్ డిపో వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో సీఎం కేసీఆర్, రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్, ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ సజ్జనార్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు వేశారు.. బ్రిడ్జి మరిచారు

టేకులపల్లి: హనుమాతండా నుంచి జేత్యాతండా – కోయగూడెం బీటీ రోడ్డు వరకు బీటీ రోడ్డు నిర్మాణం ఇటీవల పూర్తయింది. కానీ మధ్యలో ఉన్న కల్వర్టు నిర్మాణం చేపట్టకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. గతంలో రోడ్డు సరిగా లేకపోవడంతో ఎట్టకేలకు రోడ్డు నిర్మించారు. కల్వర్టు వద్ద బ్రిడ్జి నిర్మించకపోవడంతో చప్టాపై గుంతలు పడి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

అంటువ్యాధుల నియంత్రణకు చర్యలు



పరీక్షలు చేస్తున్న డాక్టర్ వెంకటేశ్వర్లు

జూలూరుపాడు: వర్షాకాలంలో వచ్చే సీజనల్, అంటువ్యాధుల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని జూలూరుపాడు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. జ్వరంతో బాధపడుతున్న వారి నుంచి రక్తనమూనాలు సేకరించారు. డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులు, అంటువ్యాధులు ప్రబలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అదేవిధంగా ఇంటి లోపల, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం డ్రైడే కార్యక్రమంలో భాగంగా వైద్యసిబ్బందితో ఇంటింటికీ వెళ్లి ఖాళీగా ఉండే నీటితొట్లు, పాతటైర్లు, పాత్రలు, కూలర్లు, కొబ్బరి బొండాలలో నిల్వ ఉన్న నీటిలో దోమల లార్వాలను గుర్తించి తొలగించారు. హెచ్ఎస్ రత్నకుమార్, హెల్త్ అసిస్టెంట్ కృష్ణ, ఏఎస్ఎం రీనా, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వరద బాధితులకు విరాళాల సేకరణ

ఇల్లెందురూరల్: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన ప్రజలను ఆదుకునేందుకు న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని చల్లసముద్రం గ్రామపంచాయతీ పరిధిలో విరాళాలు సేకరించారు. ప్రజల నుంచి నిత్యావసరాలు, బట్టలను విరాళంగా స్వీకరించారు. కొక్కు సారంగపాణి, బొగ్గరపు వెంకన్న, గంగారపు కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

టేకులపల్లి: తుఫాను బాధితులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నేత డి.ప్రసాద్, టేకులపల్లి మండల సబ్ డివిజన్ కార్యదర్శి కల్తి వెంకటేశ్వర్లు అన్నారు. పార్టీ పిలుపులో భాగంగా తుఫాను బాధితుల సహాయార్థం మంగళవారం మండల కేంద్రంలో నగదు, సామగ్రి సేకరించారు. ఎట్టి నర్సింహారావు, శంకరాచారి, శంకర్ పాల్గొన్నారు.

జీపీ భవన నిర్మాణాలకు స్థలాల పరిశీలన



సాయిరాంతండాలో స్థలాన్ని పరిశీలిస్తున్న విద్యాలత

జూలూరుపాడు: కొత్తూరు, భోజ్యాతండా, సాయిరాంతండా గ్రామాల్లో పంచాయతీ కార్యాలయ భవనాలు నిర్మించేందుకు జెడ్పీ సీఈఓ విద్యాలత మంగళవారం స్థలాలను పరిశీలించారు. ప్రస్తుతం ఆయా కార్యాలయాలు పాఠశాలలు, అద్దె భవనాల్లో కొనసాగుతుండటంతో రాష్ట్ర ప్రభుత్వం నూతన భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. ఈ మేరకు జెడ్పీ సీఈఓ స్థలాలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ.. మండలంలో 11 జీపీలకు నూతన భవనాలు మంజూరైనట్లు చెప్పారు. ఐటీడీఏ ఎస్టీ ఎస్‌డీఎఫ్ నిధులతో చింతలతండా, గురవాగుతండా, నల్లబండబోడు, సాయిరాంతండా, వెంగన్నపాలెం, ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులతో భోజ్యాతండా, గాంధీనగర్, గుండ్లరేవు, కొత్తూరు, శంభునిగూడెం, సురారంలలో జీపీ భవనాలు నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, ఎంపీఓ తులిసీరామ్, పీఆర్ఏఈ నాగేంద్ర, సర్పంచ్‌లు ధరావత్ రోజా, లావుడ్యా కిషన్‌లాల్, బూరం వెంకటలక్ష్మి, జీపీ సెక్రటరీలు పాల్గొన్నారు.

మహిళా కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

కొత్తగూడెంఅర్బన్: న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం పది రోజులు సమ్మె చేస్తే విధుల నుంచి తొలగించి మహిళా కార్మికులను అన్యాయం చేస్తారా.. అని మిడ్ డే మీల్స్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సత్తెనపల్లి విజయలక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ మంగళవారం డీఈఓ, ఎంఈఓ, తహసీల్దార్లకు వినతిపత్రాలు అందజేశారు. కంటెం అరుణ, శ్రీలత, రమణమ్మ, ప్రభావతి, మంగ పాల్గొన్నారు.

అమ్మపాలు అమృతంతో సమానం



ఇల్లెందురూరల్: తల్లిపాలపై అవగాహన కల్పిస్తున్న లక్ష్మీప్రసన్న

ఇల్లెందురూరల్: అమ్మపాలు అమృతంతో సమానమని ఐసీడీఎస్ ఇల్లెందు ప్రాజెక్టు సీడీపీఓ లక్ష్మీప్రసన్న సూచించారు. తల్లిపాల వారోత్సవాలలో భాగంగా మండలంలోని పలు గ్రామాలలో మంగళవారం ఇంటింటి సందర్శన నిర్వహించారు. ఆరేళ్లలోపు పిల్లలున్న ఇళ్లకు వెళ్లి తల్లిపాల ప్రాధాన్యంపై అవగాహన కల్పించారు. అప్పుడే పుట్టిన బిట్టకు తల్లిపాలు అందిస్తే అరిష్టమనే వారు లేకపోలేదని కానీ, పుట్టిన వెంటనే తల్లిపాలు (ముర్రుపాలు) తాగిస్తే శిశువులో రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ఆరు నెలలు వచ్చే వరకు శిశువుకు తల్లిపాలు పట్టించాలన్నది వైద్యనిపుణులు సూచిస్తున్నారని చెప్పారు. పౌష్టికాహారంపై బాలితలకు చైతన్యం కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, టీచర్లు పాల్గొన్నారు.

సుజాతనగర్: తల్లిపాల వారోత్సవాల కరపత్రాలను స్థానిక నాయకులగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ అధికారులు మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా సీడీపీఓ జెఎంఎస్ లెనీనా మాట్లాడుతూ.. తల్లిపాలను మించిన ఆహారం మరొకటి లేదన్నారు. తల్లిపాలలో వ్యాధి నిరోధక శక్తి ఉంటుందన్నారు. సర్పంచ్ మండె నాగరాజేశ్వరి, సెక్టార్ సూపర్‌వైజర్ పి.రమాదేవి, పంచాయతీ కార్యదర్శి కృష్ణకుమారి, ఉప సర్పంచ్ దండు సరిత, అంగన్‌వాడీ టీచర్ పద్మ పాల్గొన్నారు.

జూలూరుపాడు: మండలకేంద్రంలోని మెయిన్ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను ఐసీడీఎస్ చంద్రుగొండ ప్రాజెక్టు సీడీపీఓ నిర్మలాజ్యోతి మంగళవారం ప్రారంభించారు. అంగన్‌వాడీ టీచర్లు, సూపర్‌వైజర్లు, తల్లులు, వైద్యసిబ్బంది, ఆశా కాకర్తలు జూలూరుపాడు ఎస్సీకాలనీలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం సీడీపీఓ మాట్లాడారు. బిడ్డకు తల్లిపాలు శ్రీరామరక్ష అని, తల్లిపాల ప్రాముఖ్యతను గుర్తించాలన్నారు. కార్యక్రమంలో కొత్తగూడెం అర్బన్ సీడీపీఓ స్వర్ణలత లెనినా, హెచ్‌వీ సుభద్ర, ఏఎస్ఎంలు మంగమ్మ, రాణి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు ఎం.లక్ష్మి, సుజాత, నాగమణి పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరిస్తాం..



ప్రచారం చేస్తున్న రామ్మూర్తి నాయక్

జూలూరుపాడు: కాంగ్రెస్ పార్టీని గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని టీపీసీసీ సభ్యుడు ధరావత్ రామ్మూర్తి నాయక్ అన్నారు. మంగళవారం జూలూరుపాడు ఎస్సీకాలనీలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా పలు సమస్యలను స్థానికులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రజల సమస్యలు తీరుతాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్, నిత్యావసర వస్తువులు, కూరగాయ ధరలు పెంచి పేద, సామాన్య, మధ్య తరగతి ప్రజలపై మోయలేని భారం వేశాయని విమర్శించారు. స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి కాంగ్రెస్ ఓట్లతో గెలిచిన ఎమ్మెల్యే రాములు నాయక్ సొంత మండలానికి ఏమి చేశారో ప్రజలకు వివరించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన డిక్లరేషన్‌లోని అంశాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నున్నా కృష్ణయ్య, కొలిపాక వెంకటేశ్వర్లు, మందా బాబు, బానోత్ నవీన్ రాథోడ్ పాల్గొన్నారు.